పోస్టు బాక్స్

బి. రాజేశ్వరి

ఓ రాత్రి సమయంలో హఠాత్తుగా మెలకువ వచ్చి చూసింది అమల. పక్కలో అంతదాకా పడుకుని నిద్రపోతుండిన భర్త కనిపించలేదు. టేబిల్ మీద అలారం టైంపీసు రెండుగంటల పదినిమిషాలు చూపిస్తోంది. లేచి పెద్ద లైటువేసి వరండాలోకి వచ్చింది.

వరండాలోకి చేర్చివున్న పెరట్లో పూలతొట్టెల పక్కన వున్న సిమెంటు చప్టామీద కూచుని సిగరెట్ కాలుస్తూ యేవో దీర్ఘాలోచనలో వున్నాడు వేణు. అమల అతని పక్కకొచ్చి నిలబడింది. కాని, అతనదేమీ గమనించకుండా ఎటో శూన్యంలోకి చూస్తూ ఆలోచిస్తూనే వున్నాడు.

"ఏమిటి, యీ సమయంలో పెరట్లో యేం చేస్తున్నారు....?" అన్నది అమల భర్తవైపు పరిశీలనగా చూస్తూ.

వేణు ఉలిక్కిపడి చూశాడా మెవంక.

"ఏంలేదు, ఏం తోచక...." నని గేళాడు.

"ఏం తోచకపోతే, అరరాత్రి యీ చలిగాలిలో కూచోవటమెందుకు?....మీ ఆరోగ్యం అసలే మంచిది కాదు, లోపలికి పదండి. సిగరెట్లు మా నేస్తానని చెప్పి నాకు తెలీకుండా పెట్టెలకు పెట్టెలు కాల్చేస్తున్నారన్న మాట!"

"అబ్బెబ్బె. పెట్టెలు కూడానా, యిదే."

"బుకాయించకండి. కింద ఎనిమిది పీకలున్నాయి. మీ చేతిలో తొమ్మిదో సిగరెట్ వుంది. అంటే చాలా సేపట్నుంచీ మీ రిక్కడే కూచుని ఆలోచనల్తో మీ మనసుని, సిగరెట్టు పొగతో మీ శరీరాన్ని కాల్చుకుంటున్నారని నా కర్థమయింది."

"ఓహ్, నేను దాయాలన్నా దాచలేను. నువ్వు లోపలికి పద, పదినిమిషాల్లో వచ్చేస్తాను."

"ఉహూ, అదేం కుదరదు. పదండి, ముందు."

భార్య ముఖంలోకి ఓసారి చూసి, లేచి ఆమె వెంట లోనికి నడిచాడు వేణు. అమల లోనికి అడుగులు వేస్తూ భర్త మనసునంత తీవ్రంగా కలచివేసిన సమస్య ఏదై వుంటుందా అని ఆలోచిస్తోంది.

ఇది మొదటిసారి కాదు. తను వారం రోజుల్లో మూడుసార్లు భర్త యిలా ఒంటరిగా, నిద్రపోని రాత్రిళ్లు గడపటం గమనించింది.

ఇప్పుడు కూడా వచ్చి పక్కమీద పడుకున్నాడేగాని వేణు పరుపుమీద అసౌకర్యంగా కదుల్తూనే వున్నాడు. అమల అంతా గమనిస్తూనే వుంది. అతని మనసు నేదో పట్టి పీడిస్తోంది. అదేమిటో తెల్సుకోవటం భార్యగా తన ధర్మం! అతని మనోవ్యథను తను ఉపశమింపచేయగలిగితే,

అతనికి మనశ్శాంతి కలగజేస్తే....

అమల పక్కకి తిరిగి భర్తను ప్రశ్నించాలనుకుంది. కాని అప్పుడే నిద్ర పట్టినట్టుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు బరువుగా జరగటం గమనించి, అతన్ని భంగపర్చటం ఇష్టంలేక, తన ప్రయత్నం విరమించుకుంది.

తెల్లవారుఝామున ఎప్పుడో నిద్ర పట్టిందామెకు.

2

మరునాడు కూడా వేణు అన్యమనస్కంగానే వున్నట్టు గమనించింది అమల. పిల్లలిద్దర్నీ తయారుచేసి స్కూల్‌కి పంపించేసింది. వేణుకి అన్నంపెట్టి రమ్మని పిలిచినా అతను అలాగే కుర్చీలో కూచుని పేపరు చదువుతుండటం ఆశ్చర్యమనిపించి, కుర్చీ వెనకనుంచి పేపర్లోకి చూసింది.

వేణు పేపరు తిరగేసి పట్టుకున్నాడు. అంటే చదవటం లేదన్నమాట! ఏదో దీర్ఘాలోచనలో పడి కొట్టుకుపోతున్నాడు. అతనంత దీర్ఘంగా పరధ్యానంగా ఆలోచించే విషయమేమిటి? ఎందుకతను రెండు మూడు రోజులుగా యిలా ఉదాసీనంగా, ఏదో పోగొట్టుకున్నట్టు ఉంటున్నాడు?

అడిగెయ్యాలనుకుని, రెండోసారి తన ప్రయత్నం విరమించుకుంది అమల.

“అన్నం వడ్డించాను, రండి!” అన్నది.

అతను ఉలిక్కిపడ్డట్టు చూశాడామెవంక. “ఆఁ? ఊఁ, వస్తున్నా, పద!....” అంటూ హడావిడిగా లేచాడు.

ఆఫీసుకి వెళ్ళేముందు, “ఈ రోజు కాస్త ఆలస్యంగా

యింటికొస్తాను. ఆఫీసులో అక్కౌంట్స్ వెరిఫై చేసు కోవాలి!"

అమల వెంటనే యేం మాట్లాడలేదు. సాధారణంగా అయిదు దాటిం తర్వాత ఆఫీసులో ఒక్క క్షణం కూడా వుండడు వేణు. అలాంటిది యీ రోజు ఆఫీసులో పని వుందంటుంటే ఆమెకు నమ్మ బుద్ధి కాలేదు.

మౌనంగా తలూపింది.

స్కూటర్ మీద వేణు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. అయిదు నిమిషాలవరకు అతను వెళ్ళినవైపే చూస్తూ గుమ్మందగ్గరే నిల్చుండిపోయింది.

తర్వాత గుడ్డలుతకటానికి బట్టలు బాత్ రూంలో పడే స్తూంటే చేతికి గరగరమని తగిలింది భర్త జేబులో. ప్యాంటు వెనకజేబు నుంచి ఓ కాగితాన్ని బయటికి తీసింది.

అందులో అందమయిన చేతివ్రాతతో నాలుగే పంక్తులున్నాయి. అమ్మాయి దస్తూరీ అని చూడగానే తెలిసిపోతోంది.

"డియర్ వేణూ, నువ్వెందుకు తాత్సారం చేస్తు న్నావో తెలీదు. నన్ను పెళ్ళి చేసుకోవటానికి నీ కున్న అభ్యంతర మేమిటో అంతకన్న తెలీదు. వెంటనే డేట్ నిర్ణయించు. నేను ఆలస్యాన్ని, నీ ఉదాసీనతను భరించలేకపోతున్నాను. వెంటనే నీ నుంచి సమాధానం కావాలి. ఎదురుచూస్తుం టాను.

నీ

ప్రతిమ."

ఉత్తరం చదివి అలాగే స్థాణువులా నిల్చుండిపోయింది అమల. ఆ ఉత్తరం సాక్షాత్తు తన భర్తకే రాసింది. ఎవరీ ప్రతిమా? ఈమెకు తన భర్తతో ఏమిటి సంబంధం? ఈయన్ని పెళ్ళిచేసుకోవట మేమిటి? ఇతనికి పెళ్ళయిన నిజం ఆమెకు తెలీదా? తెలిసే సిద్ధపడుతోందా? ఈయన నిజాన్ని కప్పిపుచ్చి తనకి పెళ్ళికాలేదని అబద్ధం చెప్పి ఓ అమాయకురాలితో ఆటలాడుతున్నారా?

అయితే ఈమధ్య ఆయన పరధ్యానానికి యిదన్నమాట కారణం!? తనేం తప్పు చేసిందని యీాయన మనసు అన్యాక్రాంతమైపోవలసి వచ్చింది? ఇద్దరు బిడ్డల తండ్రి అయినాక యిప్పుడు కన్నెపిల్లమీదికి మనసు పోయిందా? తనని, పిల్లల్ని ఏంచేద్దామని ఆయన ఉద్దేశ్యం?

గుడ్డలు ఉతికే ప్రసక్తి మానేసి కుర్చీలో కూలబడింది అమల. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. ఏ పని చెయ్యటానికి మనస్కరించలేదు.

చెవుల్లో సముద్రపు హోరు. తల సమ్మెటతో మోదినట్టు విపరీతమైన బాధ. తట్టుకోలేని టెన్షన్. మెదడు నరాలు తెగిపోతాయేమో నన్నంత వేదన! ఆమె శరీరం దాన్ని తట్టుకోలేక చిగురాకులా వణికిపోతోంది.

వేణు యింత మోసగాడా? తనకి యిద్దరు పిల్లలకి అన్యాయం చెయ్యాలనుకుంటున్నాడా? ఈ బుద్ధి అతనిలో ఎప్పుడు పుట్టింది? తనంటే ప్రాణంపెట్టే భర్త తనపట్ల యింత అమానుషంగా ప్రవర్తించగలిగాడా? అతనింత చంచలుడా?

ఆమె మనసు సమాధానపడలేక పోతోంది. వేణు గురించి తనకి బాగా తెలుసు. ద్రోహం చెయ్యాలన్న ఆలోచన అతనిలో యెంత వెతికినా కనిపించదు. అతని ప్రేమ

సర్వస్వం తనకే అంకితమని తానిన్నాళ్ళు గర్వపడుతుండేది.

కాని, యిప్పుడు....తన అదృష్టచక్రం తిరగబడింది. తను గుడ్డిగా నమ్మిన తనభర్త తనకు ద్రోహం చెయ్యబోతున్నాడు. బహుశా యేదోక నెపం చూపించి తనని వదలించుకుంటాడు. తన బిడ్డల్ని కూడా తనతో పంపేస్తాడేమో! తనెలా బతకాలి? వేణులేని జీవితం ఊహించుకోవటానికే భయంగా వుంది. మనసును ఎవరో యినుప పిడికిలితో పిండినట్టు విలవిల లాడిపోతోంది. ఆ పరిస్థితి ఎదురుకాకముందే ప్రాణత్యాగం చేసుకోవాలని అనిపిస్తోంది.

భగవాన్, ఎంత విషమపరిస్థితి తెచ్చిపెట్టావు? నేనేం చెయ్యాలి?

అమల మనసు తెగిన గాలిపటంలా ఎక్కడెక్కడో ఏదేదో ఆలోచిస్తోంది. కళ్ళనుంచి కన్నీరు ధారపాతంగా కారిపోతుంటే, ఆవేదన భరించలేక మంచంమీద పడిపోయి, దిండులో తలదూర్చి భోరున ఏడవసాగింది.

3

సాయంత్రం పిల్లలు స్కూల్ నించి వచ్చేవరకు అమల అలా ఏడుస్తూనే వుంది. తెరలు తెరలుగా దుఃఖం తన్నుకొస్తుంటే, ఆపుకోవటం ఆమెకు శక్యం కాలేదు.

పిల్లలు చూస్తే, వాళ్ళు వేసే సవాలక్ష ప్రశ్నలకు సమాధానం చెప్పటం కష్టమని, లేచి ముఖం చల్లటి నీటితో కడుక్కునివచ్చి కూచుంది. కాస్త సేదతీరినట్టనిపించిందిగాని, మానసికంగా బాగానలిగిపోయింది అమల. ఒక్కసారిగా పదిరోజుల్లో జ్వరంపడి లంఖణాలు చేసిన దానిలా నీరసపడిపోయింది.

మనసులో ములుకులా ఆ ఉత్తరంలోని వాక్యాలే తలెత్తి భయపెడుతున్నాయి. తన సర్వస్వాన్ని తననించి తీసేసుకోవటాని కెవరో కుట్ర పన్నినట్టు, తన జీవితానికి చరమాంకం ఆరంభమయినట్టు పదే పదే ఆమెకి అనిపిస్తోంది.

సాయంత్రం వేణు వచ్చింతర్వాత ఏమయినాసరే ఆ విషయం అడిగెయ్యాలి. అతను తనకేదో చెప్పాలని యీ నాలుగురోజులుగా మథనపడుతున్నాడు. అతనికి అంత శ్రమివ్వకుండానే తనకి విషయం తెలిసిపోయింది. పరిష్కారం తనే సూచిస్తూంది.

అతని మనసు అన్యాక్రాంతం కాకూడదు. కాని అయింది! ఇంకా అతన్నే పట్టుకు వేళ్ళాడాలనుకోవటం తన అవివేకం! ఏదో అభాండం తన నెత్తిన వేసి తనను వదిలించుకోవటానికి అతనేదో పన్నుగడ పన్నేలోపల తనే మర్యాదగా అతని జీవితంనుంచి బయటపడటం మేలు!

కాని.... కాని....యిన్నాళ్ళ వైవాహిక జీవితంలో అతనితో అనుభవించిన కష్టసుఖాలు, తమ అనురాగ ఫలితంగా కలిగిన యిద్దరు బిడ్డలు, వాళ్ళ భవిష్యత్తు— యివన్నీ తెంచుకుని తను పోగలదా? ఉహుఁ! అది తన తరంకాదు. అతనికి దూరంగా తను ఒకరోజైనా గడపలేదు. తనకి అతను కావాలి! అతనులేని జీవితం వ్యర్థం! తను భర్తృతిరస్కృతగా ఒక్కరోజు కూడా బతకలేదు. అతని పాదాలముందే తన జీవితం గడిపేస్తే తనకు గౌరవం, తన జీవితానికి అదే అర్థం, పరమార్థమూను.

పిల్లల అవసరాలు చూసి వాళ్ళు నిద్రకుపడ్డాక వాలుకుర్చీలో కూచుని మళ్ళీ ఆలోచనల్లో పడింది. రాత్రి

ఆలస్యంగా వస్తానని చెప్పివెళ్ళాడు వేణు. ఎనిమిదిన్నర దాటినా యింకా యిల్లు చేరలేదు.

అతను ఆఫీసులో పని వుండటంవల్ల ఆలస్యం చెయ్య లేదని, చాలా ముఖ్యమయిన కారణమే వుండివుంటుందని గ్రహించింది. ప్రతిమని కల్సుకోవటానికి వెళ్ళాడేమో....! అసలా ప్రతిమ యెవరో మాచాయగానైనా తన కరంకాలేదు. అతని ఆఫీసులో పనిచేసే కొలీగా? అతని చిన్ననాటి స్నేహితురాలా? అనుకోకుండా పరిచయమైన ఆగంతకురాలా? ఎవరు?

అమల తలవిదిలించింది. తల చాలా భారంగా వుంది.

గోడ గడియారం పదిగంటలు కొట్టింది. వేణు యింకా తిరిగిరాలేదు. అంతదాకా ఏ స్కూటర్ శబ్దం వినిపించినా అత నేనని తలుపు తెరిచి చూస్తూ, కాదని తెలిసి నిరాశతో మూసి లోనికి వస్తున్నది.

తలుపు తెరిచి వీధిలోకి వచ్చింది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. అప్పుడో స్కూటర్, అప్పుడో మోపెడ్, చిన్న కార్లు వస్తూ పోతూ వున్నాయి. భర్త జాడ కనుచూపు మేరలో ఎక్కడా కనిపించలేదు.

అమలకు నీరసం వచ్చేసింది. ఇంత ఆలస్యంగా ఇంటికి రావటం చాలా అరుదుగా చేస్తాడు వేణు. సాధారణంగా రాత్రి ఏడుగంటలు దాటకుండా యింట్లో వుంటాడు. తనిదివరలో ఓసారి గొడవచేసింది—"వెళ్ళేది స్కూటర్ మీద, రోజూ యెక్కడ విన్నా రోడ్డు ప్రమాదాల గురించిన వార్తలే! మీరు ఆఫీసు కాగానే మరో గంటలో యింటి దగ్గర వుండకపోతే నా మనసు కీడు శంకిస్తుంది. ఆ టెన్షన్ భరించలేక ఏమైపోతానో, నాకే తెలీదు, దయచేసి వెంటనే యింటికొచ్చేయండి" అంది.

అప్పట్నుంచి సాయంత్రం ఆయిదున్నర ఆరుగంటల మధ్య ఖచ్చితంగా యింట్లో వుంటున్నాడు వేణు. మళ్ళీ యిన్నాళ్ళ తర్వాత యీ రోజే అతను ఆలస్యంచేశాడు. వెళ్ళేముందు, తన గురించి తెలిసే, ఆలస్యంగా వస్తానని చెప్పి మరీ వెళ్లాడు. కాని ఆ ఆలస్యం యిన్ని గంటలని తనకి తెలీదు. పోనీ అతను మామూలు పరిస్థితుల్లో వెళ్ళి వుంటే ఆది వేరే విషయం! ఇప్పుడతను తనకు దేన్నో పోటీ తీసుకొచ్చే ప్రయత్నంలో వుండి ఆలస్యం చేశాడు.

తనని వదిలించుకోవటానికి ఆ ప్రతిమతో కలిసి యే హోటల్లోనో, మరెక్కడో ప్లాన్ చేస్తున్నాడేమో....! ఆమెతో బాటు ఆమె తరఫువాళ్ళు కూడా యెవరైనా తోడుండి వుండొచ్చు. వాళ్ళు వేణుని జాగ్రత్తగా ఉచ్చులోకి లాగి వుండొచ్చు—ప్రతిమని ఎర వేసి.

వేణు మనసు చంచలమైందికాదు. అతనికి తనమీదున్న ప్రేమానురాగాలు తక్కువ కూడా కాదు. మరి, యీ ప్రలోభంలో ఎలా చిక్కుకున్నాడో అర్థం కాదు! తనకింత అన్యాయం చేయటానికెలా తలపెట్టాడో అసలే అర్థంకాకుండా వుంది! మనసావాచా తను అతన్నే నమ్ముకున్నది.

తలుపులు మూసి లోనికొచ్చి పక్కమీద అశాంతిగా వాలింది. దేనిమీదా దృష్టి నిలవటంలేదు. ఆకలి దహించివేస్తోంది. దానికన్న వేణుచేసిన పనికి గుండెలు మండిపోతున్నాయి. శరీరం, మనసు కూడా కుతకుతలాడిపోతున్నాయి. ఈ బాధ తను భరించలేదు. ఈ నరకం తనకి వద్దు. పగవాడికూడా యిలాంటి పరిస్థితి ఎదురు కాకూడదు. తను పడుతున్న యాతన సామాన్యమైనదికాదు.

యే క్షణంలోనైనా పగిలే అగ్నిపర్వతంలా వుంది తన గుండె.

ఆమె కళ్ళు మళ్ళీ వర్షించటం మొదలెట్టాయి. వేణుతో గడిపిన మధుర క్షణాలు, అతనితో పెనవేసుకుపోయిన తన జీవన లతకు పట్టిన దుర్గతి ఒకేసారి ఆమె మనసును ఆవహించుకుని ఆమె మెదడుమీద విపరీతమైన ఒత్తిడి తీసుకువస్తున్నాయి. తను పిచ్చిదై పోతుందేమోనన్నంత ఒత్తిడి!

పదకొండు, పన్నెండు....గడియారం రెండు గంటలు కొట్టేవరకు అమల మెలకువగా, పక్కమీద అసహనంగా దొర్లుతూనే వున్నది. కాని అతను రాలేదు. భయంకరమైన ఒంటరితనం ఆమెను వేధిస్తోంది. పిల్లలు గాఢనిద్రలో వున్నారు. నిష్కల్మషంగా, అమాయకంగా వున్న వాళ్ళ ముఖాలు చూస్తూంటే అప్రయత్నంగానే ఆమె కళ్ళు మళ్ళీ సజలాలయ్యాయి.

అటు భర్త వైపుగాని, యిటు తనవైపుగాని బంధువులులేని తను ఎంత ఒంటరిదో గుర్తొచ్చి మనసు కకావికలమైపోయింది. తన తల్లి దండ్రి ఒకేసారి చనిపోయారు ఏక్సిడెంట్లో. అప్పటికి తనకి పెళ్ళయి సంవత్సరం కూడా కాలేదు.

తన తోడబుట్టిన వాళ్ళెవరూ లేరు. తనొక్కతే సంతానం కావటంవల్ల అల్లారు ముద్దుగా పెంచి, వేణుకి పాతికవేలు కట్నంగా యిచ్చి చేశాడు తన తండ్రి! అప్పటికి వేణు తండ్రి మాత్రం బతికి వున్నాడు. సంవత్సరం క్రితం ఆయనా పోయాడు. తనకిలాగానే వేణుకి తోడబుట్టిన వాళ్ళు లేరు!

బంధువులమని చెప్పుకునేవాళ్ళు చాలామంది వున్నా,

వేణు వాళ్ళెవరినీ దగ్గరికి చేరనివ్వడు. వీళ్ళందరికీ మన ఆస్తిపాసులమీదేగాని, మనమీద అభిమానం, ప్రేమ ఏమీ లేవు. వచ్చి తినిపోతారు. చేతికి అందినవీ పట్టుకుపోతారు. అందుచేత వీళ్ళని మనకు ఆమడదూరంలో వుంచాలి—అనేవాడు వేణు.

అనటమే కాదు వాళ్ళని దూరంగా పెట్టాడు. భార్యాభర్తల మధ్య గొడవలు రావటానికి కూడా యిలాంటి బంధువులే కారకులని చెప్తుండేవాడు. అలాంటి కొరివిలాంటి బంధువుల్ని నెత్తికెక్కించుకుంటే యిక చెప్పేదేంలేదు, తలలు బోడులైపోతాయి—అంటూ నవ్వేవాడు!

తనకీ యిలా ఒంటరిగా, భర్తతోను పిల్లలతోను సింపుల్‌గా బతకటం అలవాటైపోయింది. యెంతో సంతృప్తిగా వుంది కూడా. ఇప్పుడు యెవరైనా బంధువు వస్తే ఒక్క రోజుకూడా భరించే ఓపికగాని, ఆసక్తిగాని తమకు లేవు!

ఆలోచనల మధ్య ఎప్పుడు నిద్రపట్టిందో, యెప్పుడు తెల్లారిందో అమలకు తెలియదు.

తలుపు చప్పుడుకు చటుక్కున మెలకువ వచ్చింది. లేచి, హడావిడిగా చీర సర్దుకుని తలుపు తెరిచింది.

వేణు కాదు, పనిమనిషి!

తన పిచ్చిగాని, వేణు రాత్రి యెక్కడో హాయిగా ఆమెతో గడుపుతుండి వుంటాడు. తను మాత్రం కలత నిద్రతో నిద్రలేమితో రాత్రంతా అశాంతిగా అదురు బెదురుగా గడిపింది.

గిన్నెలు తోమటానికి వేసుకుంటున్న పనిమనిషికి

నిండుగా వున్న అన్నం గిన్నె, కూరలు కన్నులపండువుగా కనిపించాయి.

4

పిల్లల్ని స్కూల్‌కి పంపేసింది అమల. పనులన్నీ అన్యమనస్కంగానే పూర్తిచేసింది. ఆ వీధి చివర వేణు ఆఫీసులో పనిచేసే క్లార్కు ఒకాయన వున్నాడు. వెళ్ళి అతన్నుంచి వేణు సంగతి ఎంక్వయిరీ చేయాలనుకుంది.

ఉదయం తొమ్మిదిగంటలయింది. తలుపుకు తాళం పెట్టి వీధి చివరున్న ఆ యింటికి వెళ్ళింది. అతన్ని అడగటంవల్ల భర్త పరపతికేమైనా లోపం వస్తుందా అని ఓ క్షణం ఆలోచించింది. కాని అంతలోనే అతని క్షేమంకోరే మనసు దాన్ని పెద్ద అభ్యంతరంగా తీసుకోకుండా కొట్టేసింది.

ఆమె వెళ్ళేసరికి అతను ఆఫీసుకు వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. ఆఫీసరు కేడర్లో వున్న వేణు భార్య స్వయంగా తమ యింటికి రావటం చాలా ఆనందం కలుగజేసింది గుమస్తా వెంకట్రావుకి.

“వేణు సార్ నిన్న సాయంత్రమే ఆఫీసు వదిలేశారండి. రాత్రి రాకపోవటం వింతగా వుంది ...” అన్నాడు వెంకట్రావు తన ఆశ్చర్యాన్ని ప్రకటితం కాకుండా.

అమల తన వూహే నిజమైందని గ్రహించింది.

“ఆఫీసునించి ఎక్కడికి వెళ్ళారో చెప్పగలరా?”

“తెలీదండి. సాధారణంగా ఆయనకు బయటి వ్యాపకాలేం వుండవు. సరాసరి యింటికి వెళ్ళిపోతుంటారు. ఇల్లు, ఆఫీసు తప్ప యితర వ్యాపకాలులేని మంచి ఆఫీసరుగా మా ఆఫీసులో ఆయన్ని అందరు గౌర

విస్తుంటారు" అన్నాడు వెంకట్రావు భాగ్యాన్ని వినపడకుండా. అర్ధరాత్రి ఊరంతా తిరిగొచ్చే తన భార్య ప్రతిరోజూ తూర్పార బట్టేయ్యటం అతని మనసులో మెదిలింది.

ప్రతిమ అనే అమ్మాయి ఎవరైనా వాళ్ళ ఆఫీసుల్లో పనిచేస్తుందేమో అడగాలనుకుంది. కాని, ఎంతో మంచి చరిత్ర వున్న తన భర్త పరువుమీద ఆ ప్రశ్న తీవ్రమైన దెబ్బ తీస్తుందనిపించింది అమలకు. అందుకే ఆ ప్రశ్న అడగటం విరమించుకుంది.

వెంకట్రావుకి థాంక్స్ చెప్పి వచ్చేసింది. ఈ ఎంక్వయిరీవల్ల వెంకట్రావులో కొత్త అనుమానాలు తనే రేకెత్తించినట్టయింది. వేణుమీద ఆఫీస్‌లో చాలా మంచి అభిప్రాయముంది. ఇప్పుడు ఊహాగానాలు మొదలవుతాయేమో....

ఇంటికొచ్చి పడింది. మనసంతా ముక్కలు చింపిన విస్తరిలా వుంది. ఓ పక్క ఆకలి బాధ. రాత్రి తినలేదు. ఉదయం టిఫిన్ చెయ్యలేదు. ఓ కప్పు కాఫీ మాత్రం అలవాటుగా తీసుకుంది, అంతే!

పదకొండు గంటలవుతుండగా ఆమెకో ఆలోచన వచ్చింది. లేచి, తలుపులు తాళంపెట్టి దగ్గర్లో వున్న పోస్టాఫీసుకు వెళ్ళి ఏభై పైసల నాణెం వేసి భర్త ఆఫీసుకి ఫోన్ చేసింది. ఆఫీసు అటెండర్ కాబోలు ఫోన్ అందుకున్నాడు.

"చూడు బాబూ, ప్రతిమ వచ్చిందా?" అన్నది.

"ఎవరమ్మగారూ?" అన్నాడు.

"మా స్నేహితురాలు. మీ ఆఫీసులోనే పనిచేస్తూన్నట్టు చెప్పింది."

"ఆ పేరుగల అమ్మ యీడలేదమ్మా! ఇంకో దఫ్తర్ల పజ్జేస్తన్నదో, ఏమో?"

"నీకు బాగా తెలుసా?"

"బలేవోరమ్మగారూ! ఈ దఫ్తర్ల నేను పాతికేళ్ళుగా పజ్జేస్తుండాను. నాకు యాదులేదంటుండ్రా?"

"వేణుగారు అక్కడేనా పనిచేస్తున్నారు?"

"వేను సారు అయితే యీడే పజ్జేస్తుండారు ఆయన మా సారే!"

"వచ్చారా?"

"ఇంకా రాలేదమ్మా."

"మీ అయ్యగారికి ఆడవాళ్ళు యెక్కువగా ఫోన్ చేస్తూంటారేమిటి?"

"ఈ మద్దెన ఒకటి రెండుమార్లు నేనే ఫోనెత్తిన. అమ్మాయిలెవరో పలికిండ్రు. అవునమ్మ, యాదొచ్చింది. మీరిందాకా అన్నారే పెతిమా యెవరో.... ఆయమ్మ ఫోన్ చేసినాది, రొండు మూడుసార్లు ఓసారి సార్ కోసం వొచ్చినాదిగూడా."

"ఆఁ, ఆఁ! ఆ అమ్మాయి సంగతే నేనడిగినది!"

"అలా జెప్పండి. ఈ ఆఫీసుల పనిజేస్తన్నాదంటే, నాకు తెల్వని మడిసెవరా అనుకుంటాను."

"ప్రతిమ, వేణుసార్ గారికోస మెందుకు వచ్చేది?"

"ఏమోనమ్మా, అదు సేయితులేమో!"

"అంతేనా, మీ సార్ తో ఆమెకు...."

"ఏమిటమ్మా, నువ్వెవరో తెల్వదుగాని, మా సార్ గురించి నీకు తెల్వదులా వుంది. ఆయన అనోంటోడుగాదు. నిప్పు.... తెల్సా?"

అమల ముఖంలో ఒక్కక్షణం గర్వంతో కూడిన

చిరునవ్వు మెదిలింది. "అయితే నిన్న సాయంత్రం మీ సార్ కోసం ప్రతిమ వచ్చిందన్నమాట!" అన్నది.

"వొచ్చిందని నేననలేదే! మీతో ఎవరన్నారు?"

"నాతో ప్రతిమ చెప్పింది. నిన్న సాయంత్రం నన్ను అక్కడికి రమ్మంది. వచ్చాను. అప్పటికే మీ ఆఫీసులో అందరు వెళ్ళిపోయారు. బహుశా మీ సార్‌తో వెళ్ళి పోయి వుంటుందని అడిగాను. అందుకే యిప్పుడు ఫోన్ చేశాను ఆమెకోసం. సరే, మళ్ళీ సాయంత్రం ఫోన్ చేస్తానుగాని, ప్రతిమ వస్తే మీ స్నేహితురాలు నీకోసం ఫోన్ చేసిందని చెప్పు!" అని ఫోన్ పెట్టేసింది.

అతను మరీ అంత తెలివైనవాడు కాదని అతని మాటలనిబట్టే గ్రహించింది అమల. అందుకే సందర్భాను సారం అతనికి అనుమానం రానివిధంగా తనకు కావలసిన సమాచారం రాబట్టుకుంది.

ప్రతిమ ఆఫీసుకికూడా వచ్చి వెళ్ళేదంటే, ఆమెకు వేణుతో బాగా సన్నిహితత్వం కలిగివుంటుంది. అయితే వేణు చాలా రిజర్వ్‌డుగా వుండే మనిషి కావటంవల్ల అతన్ని ఆఫీసులో ఎవరూ అనుమానించలేదింతవరకు. ఆ టెండరు కూడా అనుమానపడనివిధంగా వ్యవహారం నడుస్తోందన్నమాట!

అయితే తను అనుమానించినట్టు నిన్న సాయంత్రం వేణుకోసం ప్రతిమ రాలేదు. మామూలుగానే ఆఫీసు అవర్సు అయేవరకు వుండి వేణు ఆఫీసునుంచి బయల్దేరి వెళ్ళిపోయాడు. బహుశా ఫోన్‌లో పిలిపించుకుని వుం టుంది. వాళ్ళిద్దరు కల్సుకునే సంకేత స్థలం ఏదో వుండి వుంటుంది. అక్కడికి వెళ్ళి వుంటాడు. రాత్రంతా అక్కడే గడిపివుంటాడు. ఉదయం సరాసరి ఆఫీసుకు

రావాలనుకుని కూడా రాలేకపోయి వుంటాడు.

అతనికోసం తానింత తాపత్రయ పడిపోయి, అతని క్షేమంకోసం తహతహపడనక్కర్లేదు. అతను తన సుఖం తను చూసుకుంటూ, భార్యా పిల్లల్ని కూడా పట్టించుకో కుండా భోగలాలసతోపడి కొట్టుకుపోతుంటే తను అత నేమైపోయాడోనని గంగ వెర్రులెత్తిపోవటం అనవసరం!

ఈ ఆలోచన రాగానే సరాసరి యింటికి తిరిగొచ్చే సింది అమల. అతని గురించి తను తిండి తినకుండా మాడి నందుకు తనమీద తనకే కోపంవచ్చి, శుభ్రంగా వడ్డిం చుకుని తిన్నది. తిండి తిన్నాక ఎక్కడలేని నీరసం ఆవ హించి పక్కమీదపడి సాయంత్రంవరకు ఒళ్లెరగకుండా నిద్రపోయింది.

5

సాయంత్రం అకస్మాత్తుగా మెలకువ వచ్చి లేచింది అమల.

గోడగడియారంవంక చూసింది. అయిదు గంటలు దాటి రెండు నిమిషాలయింది. అయిదు కొడ్తుండగా మెలకువ వచ్చింది — గడియారం గంటలకేనన్నమాట!

అంటే అయిదు దాటిపోయింది, కాని, స్కూలుకి వెళ్ళిన పిల్లలిద్దరు తిరిగి రాలేదు. నాలుగున్నర లోపునే వాళ్ళు రిక్షాలో తిరిగొస్తారు. కాని ఇంతదాకా రాక పోవటమేమిటి?''

ఆమె పక్కమీదినించి ఒక్క ఉదుట్న లేచి బయటి కొచ్చింది. రోడ్‌మీద రిక్షాలు కనిపిస్తాయేమోనని! పిల్లల్ని తీసుకొస్తున్న కాన్వెంటు రిక్షాలు హడావిడిగా రోడ్డున పోతున్నాయి. బహుశా యీరోజు యెందుకో స్కూలు ఆలస్యంగా వదిలిపెట్టి వుంటారు. తను అనవసరంగా

హడావిడి పడిపోయింది.

లోపలికొచ్చి పిల్లలకోసం గబగబ పాలు కాచి హార్లిక్స్ కలిపింది. వాళ్ళొచ్చేసరికి పొగలు కక్కే హార్లిక్స్ తయారుగా వుండాలి. లేకుంటే వంటగదిలోకి జొరబడి నానా హడావిడి చేస్తారు.

బయట రిక్షా ఆగిన శబ్దం వినిపించింది. పిల్లలు వచ్చేశారు, అనుకుంటూ బయటికి తొంగిచూసింది. రిక్షా కాన్వెంటు పిల్లల్ని తీసుకొచ్చే వీరాస్వామిదే. కాని, పిల్లలు లేరందులో.

వీరాస్వామి దిగులుగా నించుని, "అమ్మగారూ!" అని పిలిచాడు. ఒక్క అంగలో బయటకొచ్చింది.

"పిల్లలుగాని యింటికొచ్చారా, అమ్మా?" అన్నాడు వీరాస్వామి.

"లేదే! అదేమిటి, స్కూల్లో లేరా?"

"లేరమ్మగోరూ! సానాసేపు సూసిన. తవ బిడ్డలిద్దరు అపల్లేదు. ఒకేల ఏదన్నా పనిబడి ముందుగా తీస్కొచ్చేశారేమోనని వొచ్చేసిన. ఇక్కడకొస్తే తవరిలాగంటున్నారు!?"

అమల పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. పిల్లల్ని ఎత్తుకుపోయే మనుషుల గురించిన కథలు గుర్తొచ్చి ఒళ్ళంతా చల్లబడిపోయింది.

భగవాన్ తన పిల్లలకు యెలాంటి అపద యెదురు కాకూడదు. వాళ్ళు క్షేమంగా వుండాలి! నువ్వే రక్ష తండ్రీ—అంటూ లోలోపలే వెయ్యి దేముళ్ళకు మొక్కుకున్నది అమల.

"చూడు వీరాస్వామీ, మళ్ళీ యింకోసారి వెళ్ళి పరీక్షగా చూడు. ఏ పక్కనయినా ఆడుకుంటూ వుండి

పోయారేమో. నిన్ను చూడకపోయుండవచ్చు. వెంటనే వెళ్ళు ...”

ఆమె నోటిలో మాట నోట్లో వుండగానే “అట్లాగే నమ్మ....” అంటూ వీరాస్వామి రిక్షామీద రయ్యిన వెళ్ళిపోయాడు.

అమల నిస్సహాయంగా, నించున్న చోటనే కూలబడి వీధిలోకే దృష్టిని నిలిపి చూస్తోంది.

6

రీసెస్ టైం. పిల్లలు గోలగా స్కూలు బయటకొచ్చి స్వేచ్ఛగా గాలి పీల్చుకుంటున్నారు. అంతదాకా చండశాసనుల్లాంటి టీచర్ల పరిధిలో నుంచి బయటపడి కాసేపయినా స్వేచ్ఛలోని ఆనందం అనుభవించడానికి ఉరకలు వేస్తున్నారు.

రవి, వాసు బయట నించుని రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల వంక చూస్తున్నారు. అమ్మ పొరపాటున కూడా అలాంటివాటిని తినకూడదని చెప్పింది. కలరా టైఫాయిడ్ లాంటి తీవ్రమైన వ్యాధులు వస్తాయని, అలాంటివి తినకూడదని చెప్పిందిగాని, వాటిని చూస్తూంటే అలా అనిపించటంలేదు. తినాలనే కోరికను బలవంతంగా అణచుకుంటూ అలాగే నించున్నారు.

ఇంతలో యెవరో ఓ పెద్దాయన బయట వున్న పిల్లల్ని అడుగుతున్నారు—“వేణుగోపాల్ గారి పిల్లలెవరు మీలో?”—అని.

“వాళ్ళ పేర్లేమిటో చెపితే తెలుస్తుందిగాని ఫాదర్ పేరు చెపితే యెలా?” అని ప్రశ్నిస్తున్నాడో వాచ్‌డు గాయి కుర్రాడు.

“తొందర్లో అడిగిరావటం మర్చిపోయాను బాబూ!

వాళ్ళ నాన్నగారి పేరు మాత్రమే తెల్సు. ఆయన స్కూటర్ ఏక్సిడెంట్లో హాస్పిటల్లో వున్నారు. వాళ్ళమ్మగారు వెంటనే వాళ్ళిద్దర్నీ తీసుకురమ్మన్నారు....” అంటున్నాడతను.

క్షణాలమీద అక్కడున్న పిల్లల్లో సంచలనం వచ్చింది.

రవి, వాసుల చెవుల వేణు అన్న మాట పడగానే ఆ మనిషి దగ్గరకు గబగబ వచ్చారు. నిన్న సాయంత్రంనుంచీ నాన్నగారింటికి రాలేదని మమ్మీ చెపుతోంది. ఇప్పుడేమయ్యింది నాన్నగారికి?

“వేణుగారు మా డాడీయే, ఏమయింది? మీరెవరు?” అనడిగాడు రవి, పెద్దవాడు. వాసు రెండో తరగతి రవి మూడో తరగతి చదువుతున్నారు.

“మీరేనా బాబూ? మీ నాన్నగారి స్కూటర్ని లారీ కొట్టింది. హాస్పిటల్లో వున్నారు. మీ యిద్దర్నీ వెంటనే తీసుకురమ్మన్నారు బాబూ!....” అన్నాడతను.

రవి, వాసు వెంటనే “పద, పద!” అన్నారు.

అతను వాళ్ళిద్దర్నీ ఆటోలో యెక్కించుకుని వెళ్తుండగా, టీచర్సు స్కూల్ బయటికొచ్చి “వాట్ హాఫెండ్ ఛిల్డ్రన్?” అనడిగారు.

ఓ పెద్ద కుర్రాడు జరిగిన సంగతి చెప్పాడు.

“అరె, అలాగా. ఎవరి మా కెందుకు తెలియచెయ్యలేదు? ఆ మనిషి మా పర్మిషన్ తీసుకోకుండా పిల్లల్నెలా తీసుకు వెళ్ళాడు?” అన్నది ఓ టీచరు ఇంగ్లీషులో.

“ఐ డోంట్ నో టీచర్!” అన్నాడా కుర్రాడు. మరికొందరు కుర్రాళ్ళు కూడా మెల్లిగా తప్పుకున్నారు

టీచర్ యేమన్నా అంటుందనే భయంతో.

పక్కనున్న టీచర్, "ఆ తొందర్లో, ఆ వచ్చిన వ్యక్తి మనకు చెప్పకుండానే తీసుకుపోయివుంటాడు. అలాంటి సమయాల్లో స్కూలు రూల్సు, రెగ్యులేషన్స్ వాళ్ళకేం తెలుస్తాయి?" అన్నది సర్దిచెప్తున్నట్టుగా.

7

వీరాస్వామి మళ్ళీ వచ్చి జరిగిన సంగతంతా చెప్పే సరికి నిలువునా నీరయిపోయింది అమల. తను భయపడినంతా అయింది. ఎవడో తన పిల్లల్ని మాయ మాటలు చెప్పి దొంగిలించుకుపోయాడు. టీచర్సుకి తెలకుండా, వాళ్ళు రీసెస్‌లో బయటికొచ్చి ఆడుతున్న సమయంలో తీసుకుపోయాడు.

వాడికి వేణు పేరు తెలుసు. కావాలనే తమ పిల్లల్ని తీసుకుపోయాడు. బహుశా తమ పిల్లల్ని వాడు గతంలో చూడకపోయివుండొచ్చు. అందుకే వేణు పిల్లలెవరని ఎంక్వయిరీ చేశాడు. వాడు కావాలనే తమ పిల్లల్ని అడిగి మరీ తీసుకుపోయాడు. అంటే వాడు తమకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పరిచయమున్న వాడే!

ఎవరు వాడు? యెందుకు తన పిల్లల్ని యెత్తుకు పోయాడు? సమయానికి వేణు లేకపోవటం, ఈ సంఘటన జరగటం అమలకు పిచ్చెత్తిపోయింది. నోట మాట రాకుండా చాలాసేపు అలాగే వుండిపోయింది.

"పోలీసు రిపోర్టు యివ్వండమ్మా, రండి నా రిక్షాలో యెళ్దాం—" అన్నాడు వీరాస్వామి కర్తవ్యం గుర్తు చేస్తూ.

అప్పటికి విషయం తెలిసిన యిరుగు పొరుగు ఆడవాళ్లు

చేరారక్కడ. తలోకరు తలో మాట అంటున్నారు. గతంలో పిల్లల్ని ఎత్తుకుపోయిన సంఘటనలు—వాళ్ళ కాళ్ళ చేతులు విరిచేసి ముష్టివాళ్ళగా మార్చిన సందర్భాలు, ఏదో నిధినిక్షేపాల కోసం దేవతకు బలిచ్చిన సంఘటనలు—చెప్పుకుంటున్నారు గోలగా.

కర్తవ్యం గుర్తుచేసింది వీరాస్వామి ఒక్కడే. అప్పటికే నలుగురు వేణు గురించిన ప్రసక్తి తెస్తున్నారు. అతను లేని విషయం వాళ్ళముందు చెప్పవలసిన అవసరం రాకూడదని అమల చటుక్కున రిక్షా ఎక్కేసింది.

పోలీసు సబిన్స్పెక్టరు కేసు రిపోర్టు తయారుచేసి, యిన్ఫర్మెంటుగా ఆమె సంతకం తీసుకుని "మా శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తాం" అన్నాడు.

ఆమెకు పోలీసుస్టేషనంటే ఎలర్జీ. పోలీసులు నేరస్థుల పట్లకన్న, నిర్దోషులపట్ల చాలా కఠినంగా, అమానుషంగా ప్రవర్తిస్తారన్న నిజాలను విని, చదివి, పోలీసులంటేను, పోలీస్ స్టేషనంటేను అసహ్యాన్ని పెంచుకుంది.

ఇప్పుడు అదే స్టేషన్లో రిపోర్టివ్వటం బాధాకరంగానే వున్నా తప్పనిసరిగా తెలియచేసి బయటపడింది—ఒక్క క్షణం అక్కడ నిలబడలేనట్లుగా.

ఆ రాత్రి వెంకట్రావు విషయం తెలిసివచ్చి ఓదార్చాడు అమలను. వేణు ఆఫీసుకు రాని విషయం, సెలవు కూడా పెట్టని విషయం చెప్పాక, అమలకు పరిస్థితి మరీ అగమ్యగోచరంగా అనిపించి, ఆ రాత్రి నిద్రపట్టలేదు.

8

తెల్లవారేవరకు సంతతధారగా ఏడుస్తూనే వున్నది అమల. భర్త, పిల్లలు ఒకేసారి పగబట్టినట్టు తననించి మాయమైపోయారు. ఇంకా తన గుండె ఆగిపోకుండా,

బదులు రాకుండా ఎట్లా వుండా అని ఆశ్చర్యంగా వుందామెకు. తన కష్టం చెప్పుకోవటానికి తనవాళ్ళంటూ ఎవరూ లేరు. తన గుండెకోత, కడుపుకోత ఎవరికి చెప్పుకుంటుంది?

ఆమె మనసు ఎందుకో కీడు శంకిస్తోంది. భర్త భోగలాలసుడై యింటికి కూడా రాకుండా ఎక్కడో ప్రియురాలి కౌగిట్లో బందీ అయిపోతే తన పిల్లలు ఏ క్రూర రాక్షసుడి చేతిలోనో బందీలుగా చిక్కిపోయారు. పిల్లల అల్లరితో, రణగొణ ధ్వనులతో కళకళలాడిన ఇల్లు బోసిపోయి, భయంకరమైన నిశ్శబ్దంతో తన మనసును తూట్లు పొడుస్తోంది.

"అమ్మా, పోస్టు" అన్న కేకతో చటుక్కున, బాత్‌రూంకి వెళ్ళబోయినదల్లా బయటకొచ్చింది.

పోస్టుమాన్ "రూపాయి డ్యూ పడిందమ్మా!" అంటూ నలిగిపోయిన ఓ కవరు ఆమె చేతికందించాడు. దానిమీద అసలు పోస్టేజి అతికించనేలేదు.

కవరుమీది దస్తూరివైపు ఆమె కళ్ళు పరుగెత్తాయి.

పరిచయమైన దస్తూరి. ఆ తర్వాత తట్టింది, అది భర్త చేతిరాతేనని.

వెంటనే రూపాయి చెల్లించి పోస్టుమాన్‌ను పంపేసి, కవరును ఒణికే చేతుల్లో విప్పింది.

హడావిడిగా నాలుగే వాక్యాలు రాశాడు వేణు, అంతా చిందరవందరగా బాగా నలిగిపోయిన కాగితం మీద రాశాడు. కవరు కూడా బాగా నలిగిపోయి వుంది. బ్రౌన్ కలరు, ఆఫీసు కవరు.

"అమలా, యీపాటికి నా గురించి బాగా కంగారు పడుతూ వుంటావు. నేనో విషవలయంలో చిక్కుకు

పోయాను. ప్రస్తుతం ఓ దుష్టశక్తి చేతిలో బందీగా వున్నాను. ఎక్కడ బంధించబడ్డానో వివరాలు తెలియదు. మన పిల్లల్ని జాగ్రత్తగా యింట్లోనించి బయటకు రానివ్వకుండా చూసుకో. వాళ్ళని యెత్తుకుపోయే ప్రయత్నం జరగొచ్చు. నేనెలాగో తప్పించుకొస్తాను. వివరాలు రాయటానికి టైంలేదు....” అంతే, సంతకం కూడా పెట్టకుండా హడావిడిగా పోస్టు చేసేసినట్టుంది. అందుకే స్టాంపులు అతికించలేదు.

ఆ ఉత్తరం చదివి అచల కళ్ళవెంట కన్నీరు బొట బొటా కారిపోయింది. భర్తని తను చాలా ఘోరంగా అపారం చేసుకుంది. ఎవరో ఆయన్ని అపహరించుకుని పోయారు. ఆయన చేసిన హెచ్చరిక తనకు యీ రోజు అందింది. ఈలోపలే పిల్లల్ని యెత్తుకుపోవటం జరిగి పోయింది.

చటుక్కున కవరుమీది పోస్టు ముద్ర చూసింది. స్టాంపు లేకపోవటంవల్ల ‘డ్యూ’ ముద్రవేసి, పక్కన పోస్టాఫీసు ముద్రవేశారు. నిన్న సాయంత్రం మూడు గంటలకు ఆ ఉత్తరం భరత్ నగర్లో పోస్టయింది. కూకట్ పల్లి సమీపంలో.

ఆమె కళ్ళు మెరిశాయి. ఆయనను బహుశా కూకట్ పల్లి సమీపంలోనే యెక్కడో బంధించి వుండాలి. అక్కడ కొత్తగా కాలనీలు లేస్తున్నాయి. కొంత మేర కొండలు, బండలు రాళ్ళు రప్పలు వున్నా, అదంతా చదును చేసి యిళ్ళు కట్టేస్తున్నారు. అక్కడే ఎక్కడో భర్తని బంధించి వుండాలి! పిల్లల్ని ఎత్తుకుపోయిన వాళ్ళకు, వేణును బంధించిన వాళ్ళకు సంబంధముందని తెలుస్తోంది. పిల్లల్ని ఎత్తుకుపోతారని ఆయనకు ముందే

తెలుసు! కాని సమయం మించిపోయింది.

అయినా, ఫరవాలేదు. తన భర్తను, పిల్లల్ని రక్షించుకోవటానికి తను ప్రాణాలైనా త్యాగం చేస్తూంది అవసరమైతే!

అప్పటికప్పుడే ఓ నిర్ణయాని కొచ్చేసింది అమల. చకచక తయారయింది. తలుపుకు తాళంపెట్టి రోడ్ మీది కొచ్చింది.

9

"ఇదిగో ఫ్రెండ్, నీ కొడుకుల్ని కూడా తీసుకొచ్చాను నీకు తోడుంటారని!" రవిని, వాసుని చెరో రెక్కా పట్టుకుని లాక్కొచ్చాడు. అతను.

వేణు చివ్వున తలెత్తి, "ఛీ, చివరికి యీ పసివాళ్ళను కూడా నీ పావులుగా ఉపయోగించుకోవాలను కుంటున్నావా? నిన్ను భగవంతుడు కూడా క్షమించడు!" అన్నాడు కోపంగా.

వాసు, రవి తండ్రిని చూడగానే "డాడీ!" అంటూ పరుగెత్తుకుని రాబోయారు.

అతను వాళ్ళిద్దర్నీ రెక్కలుపట్టి ఆపేసి, "ఆగండ్రా నాయనలూ! అంత తొందరగా మీ నాన్నతో చేరిపోనిస్తానా? మిమ్మల్ని కత్తికో కండలుగా కోసి, మీ నాన్నముందే సమాధి చేసెయ్యనూ? ఆగండాగండి!" అన్నాడు నవ్వుతూ.

"నువ్వు మనిషివా, రాక్షసుడివా? నీ పాడు పనికి వీళ్ళను కూడా ఉపయోగించుకోవాలనుకోవటం రాక్షసత్వం."

"మరేం ఫరవాలేదు, నువ్వు మా దారికొస్తే ఎవరి ప్రాణాలకు ప్రమాదం రాకుండా మేం చూసుకుంటాం.

నువ్వు మా మాట వినటం లేదు కదా!"

"ఛ, దేశద్రోహానికి తలపడే తొత్తునుకాదు నేను!"

"అందరూ మొదట్లో అలాంటి కబుర్లు చెప్పినవాళ్ళే! తర్వాత డబ్బుకి లొంగిపోయి, గతంలో నీ స్థానంలో వున్న ఆఫీసర్లు మాకు బాగా సాయంచేశారు. డబ్బుకి కూడా లొంగనివాళ్ళు ఇదిగో మా రీటా అందచందాలకు దాసోహమన్నారు. కమాన్ మిస్ రీటా, అయ్ మీన్ మిస్ ప్రతిమా!" అన్నాడతను అక్కడే వున్న ఓ సుందరి వైపు కన్నుగీటి.

వయ్యారంగా నడుచుకుంటూ వచ్చింది ప్రతిమ, అలియాస్ రీటా.

"ఛీ, దీన్ని నాకు ఎరగావేసి నా చేతకాని పనులు చేయించాలని పన్నాగం పన్నావు. యేదో బలహీన క్షణంలో నేను లొంగిపోతే, అదంతా ఫిల్ముతీసి, నన్ను బ్లాక్ మెయిల్ చేయాలనుకుంటున్నావు. నేను, నా భార్యకు చేసిన ద్రోహానికి యిప్పటికే కుమిలి కుమిలి ఛస్తున్నాను. ఆ మహాసాధ్వి మొహం చూడలేక తప్పించుకు తిరగాను యిన్నాళ్ళు. నేను లొంగి రాకపోవటంతో నన్ను బలవంతాన ఎత్తుకొచ్చి బంధించావు. నేను కాదన్నానని కక్ష సాధింపుకి నా పిల్లల్ని కూడా మాయమాటలు చెప్పి ఎత్తుకొచ్చావు. నేను లొంగివస్తాననేగా నీ ఉద్దేశం? నెవర్ .... నెవర్ ...." ఆవేశంతో అరిచాడు వేణు.

"నీ పిల్లల్ని నీ ముందే ఖండఖండాలుగా కోసినా దారికి రాకపోవటానికి నువ్వు తండ్రివేగాని, కసాయి వాడివి కాదుకదా! అప్పటికీ మా దారికి రాకపోతే ఇంకా నీ భార్య వుందికదా! ఆమెను క్షణాల్లో ఇక్కడికి

తీసుకొస్తాం. ఎలా పరాభవించాలో మాకు తెలుసు అప్పటికైనా మా దారికి వస్తావనే నమ్మకం మాకుంది. యెందుకంటే తన కళ్ళముందే భార్యను మానభంగం చేస్తూంటే చూస్తూ సహించగల భర్తలు ఎవరుంటారు చెప్పు?...." అతను ఫెళ్ళున నవ్వాడు.

రీటా శ్రుతి కలిపింది. వాళ్ళిద్దర్నీ సమూలంగా నరికి పారేద్దామన్నంత క్రోధం, కసి రేగాయి వేణులో. బల వంతాన నిగ్రహించుకున్నాడు.

అతను నవ్వి, అన్నాడు. "నువ్వు చాలా మొండి వాడివి. కాని మొండితనం అన్నివేళలా మంచిది కాదు బ్రదర్! నీది ప్రభుత్వంలో కీలకమైన ఉద్యోగం. ఈ దేశానికి, రక్షణకి సంబంధించిన శాఖ నీది. అందుకే నీ సీటుకి పెద్ద డిమాండు, లక్షలు లక్షలు కుమ్మరించి రహ స్యాలను కొనుక్కోవటానికి నాలాంటి స్వదేశీయులు ఎందరో విదేశీయులకి చేరం కుదుర్చుకోవటానికి అదే కారణం.

మా మాట విన్న నీ ముందు పనిచేసిన ఆఫీసర్లు మేడలు మిద్దెలు కట్టుకున్నారు. పొలం, పుట్రా కొను క్కున్నారు. లక్షలకి లక్షలు కామ్ని తన వాళ్ళందరి పేర్లతోను అకౌంట్సు తెరిచి దాచుకున్నారు. నగలు కొనుక్కున్నారు.

కాని నువ్వొట్టి ఫూల్‌వి. నిన్ను నమ్ముకున్న పెళ్ళాం బిడ్డలకి చివరికి చిప్ప చేతికిచ్చేలా వున్నావు. అయితే ప్రతివాడిలోను ఓ వీక్ పాయింటుంటుంది. నీలో ఉమన్ వీక్‌నెస్ వుంది. నువ్వు స్త్రీలోలుడివని నిరూపించు కున్నావు. కాని ఆ పిల్లని ఉపయోగించుకొని కూడా రహ స్యాలని మా కప్పగించనన్న మొండివాడిని నిన్నే

చూశాను. చివరికి ఫిల్మ్ బయటపెట్టి నీ పరువుతీస్తానన్నా సిద్ధపడ్డావుగాని, రహస్యాల్ని చెప్పటంలేదు.

నువ్వు చెప్పొద్దుగాని, ఆ ఫైలు మా మొహాన పారెయ్యి. క్షణాలమీద మైక్రో ఫిల్మ్‌తో ఫోటోలు తీసుకుని పువ్వుల్లో పెట్టి....ఛ ఛ....లక్షల్లో పెట్టి నీకు అప్పగించేస్తాం. ఈ సంగతి మూడో కంటివాడికి తెలియ నివ్వం. నీ పొజిషన్‌కి ఏం దెబ్బరాదు. హాయిగా లక్షాధి కారివై పోతావు. లేదా, పెళ్ళాం బిడ్డలతో ఈ యింట్లో సజీవ దహనమయిపోతావు.

నీకీ రాత్రి టైమిస్తున్నాను. ఒప్పుకున్నావా సరే, లేదా నీ పిల్లల్ని ముక్కలు ముక్కలుగా తరిగేస్తాను. నీ భార్యను నీ ముందే....గుర్తుంచుకో!" అంటూ బయటకి వెళ్ళిపోయాడు, రీటాతో.

వేణు పిల్లలిద్దరివంకా చూశాడు.

వాళ్ళిద్దరినీ నిర్దాక్షిణ్యంగా చేతులు వెనక్కి విరిచి కట్టేశాడు రాబర్టు. సోఫా కాళ్ళకు తాళ్ళ చివర్లను కట్టేశాడు. ఇద్దరు బాగా ఏడ్చిన గుర్తుగా కళ్ళు ఉబ్బి పోయాయి.

"డాడీ! ఏమిటి డాడీ యిదంతా? ఆ బూచాడెవరు? మనల్ని ఎందుకిలా కట్టేశాడు? నీకు ఏక్సిడెంట్ అయిందని చెప్పి తీసుకొచ్చాడు."

"అంతా అబద్ధం బాబూ! మోసంచేసి నన్ను తీసు కొచ్చారు. నాకు ఏక్సిడెంట్ అయిందని చెప్పాడా ఆ రాస్కెల్? మీరు నిజమని నమ్మివచ్చి ఉచ్చులో పడి పోయారు. మీ అమ్మ ఎలా వుంది? మీకోసం అలమ టించి పోతుంటుంది."

"ఎలా డాడీ, తప్పించుకోవటం?"

"అదే ఆలోచిస్తున్నాను! ఏం తోచటంలేదు" నిస్సహాయత ధ్వనించింది వేణు కంఠంలో.

10

భరత్ నగర్ కాలనీలో బస్ దిగింది అమల. పోస్టాఫీసు ఎక్కడుందో ఎంక్వయిరీ చేసింది. అక్కడ పోస్టు బాక్సులున్న ఏరియాలు తిరిగిచూసింది. కాలనీ అంతటికీ మూడుచోట్ల మాత్రం బాక్సులు కనపడ్డాయి.

ఇదే పోస్టాఫీసులో ఉత్తరం పోస్టయింది కాబట్టి, ఈ బాక్సుల్లో ఏదొకదానికి సమీపంలో వేణు బందీ అయిపోయాడని అనుకోవాలి. యెందుకంటే పోస్టు బాక్సులో ఉత్తరం వేసేటంత సావకాశం వేణుకి వుండనివ్వరు శత్రువులు! కాబట్టి పోస్టు బాక్సు చాలా సమీపంలో, అందుబాటులో వుండి వుండాలి వేణుకి!

ఆ మూడింటిలో ఒక పోస్టు బాక్సు ఒక ఇంటి కిటికీకి వేలాడదీయబడింది. అదే ఇల్లు అయివుండాలనుకుంది అమల. ఆ చుట్టుప్రక్కల ఎంక్వయిరీ ప్రారంభించింది.

ఆమె ప్రశ్నలకు ఎవరూ సరిగ్గా సమాధానం చెప్పలేదు.

అయినా ఆమె తన ప్రయత్నం విరమించుకోలేదు. అలా అలా అడిగిన ప్రశ్నలే అడుగుతూ తిరుగుతోంది. తన ప్రయత్నంలో ఆ శత్రువే ఎదురవుతాడేమో అన్న భయం ఓ పక్క బాధిస్తోంది. అప్పుడు తన ప్రయత్నం ఫలించినా, తనూ ఆ ఉచ్చులో బిగిసిపోవాల్సి వుంటుంది. అది కూడా తనకి ఆనందదాయకమే? అందరు కలిసి ఒకచోట బతికినా, మరణించినా ఆనందమే!

చివరకు ఓ వృద్ధురాలు చెప్పింది. "ఓ గడ్డపాయన

ఇద్దరు మొగపిల్లల్ని తీసుకొచ్చాడమ్మా. అదిగో ఆ ఎర్ర డబ్బా తగిలించి వున్న యింటికి తీసుకు వెళ్ళాడు. ఆళ్ళ బిడ్డలుగావాల్ను, అతని వెనకనే చెయ్యి పట్టుకుని వెళ్ళారు!" అని.

ఎర్ర డబ్బా-పోస్టు బాక్సు!

అమల చకచక ఆ పోస్టు బాక్సున్న యింటివైపు అడుగులు వేసింది. తక్కిన ఇళ్ళకు కొంచెం దూరంగా విడిగా వుందా ఇల్లు.

సరాసరి ఆ ఇంటికి పోకుండా పక్కనుంచి వెళ్తూ ఓసారి ఆ ఇంటిని పరిశీలించింది అమల. తలుపులు లోపల బిగించి వున్నాయి. పోస్టు డబ్బా వున్న కిటికీ పైతలుపులు మాత్రం కొద్దిగా తీసి వున్నాయి.

కిటికీలోనుంచి తొంగి చూసింది అమల.

ఆమె కళ్ళు మెరిశాయి.

లోపల తన కొడుకులిద్దరు సోఫాకి బంధించబడి వున్నారు. తన భర్త వేణును పెడరెక్కలు విరిచికట్టి ఓ పెద్ద రాటకు కట్టేశారు.

వేణు ముఖంమీద కత్తితో కోసిన గుర్తులు. రక్తం చారికలు. అతని వంటిమీద షర్టులేదు. ఛాతీమీద కూడా శాకతో పొడవునాకోసి, హింసించిన గుర్తులు. తన పిల్లల్ని కూడా బాగా హింసించినట్టున్నారు శత్రువులు. కోపతో తలలు వాల్చేసిన వాళ్ళను చూస్తే ప్రాణం వుందా అన్న అనుమానం కలుగుతుంది.

వేణు కెదురుగావున్న వ్యక్తి చేతిలో రివాల్వర్ నిగనిగ మెరుస్తోంది. పక్కనే ఓ పాతికేళ్ళ యువతి నించుని వుంది. ఆమె ఎవరో తేలిగ్గానే ఊహించుకుంది అమల. ఆ గడ్డపాడే తన భర్తను, పిల్లల్ని అపహరించుకుపోయిన

వాడని ఆరణ్యమైపోయింది. వాడు భర్తను రివాల్వర్‌తో చంపుతానని బెదిరిస్తున్నాడు.

అమల ఆలస్యం చెయ్యలేదు. పక్కనే వున్న పెద్ద రాయిని తీసుకుంది.

తలుపు తట్టింది. రీటా తలుపు తెరిచి "ఎవరు?" అన్నది పక్కలకు చూస్తూ. వెంటనే బండరాయితో ఆమె తలమీద మోదింది. రీటా నేలమీద పడిపోయింది అరుస్తూ.

హడావిడిగా రాబర్టు బయటికొచ్చేలోపల అమల మరో రాయితో సిద్ధంగా వుంది. అతను తల బయటికి పెట్టబోయేంతలో మెరుపు దాడిచేసింది. బండరాతితో అతని తలమీద బలంగా మోదింది.

రాబర్టు నేలమీదపడి గిలగిల కొట్టుకుంటుండగా రివాల్వరు చేజిక్కించుకొని భర్త దగ్గరికి వెళ్ళి కట్లు చాకుతో కోసేసింది. పిల్లల బంధాలు కూడా కోసేసింది.

"పదండి, వెంటనే పోలీసులకి తెలియజెయ్యాలి. చుట్టుపక్కలవాళ్ళు వస్తున్నారు. వాళ్ళకు నిజం చెప్పి వీళ్ళు తప్పించుకుపోకుండా చూడాలి...." అన్నది అమల ఆయాసంతో.

"అమలా, నన్ను క్షమించు!" అంటున్న భర్త నోరు చేతితో మూసి, అతని కళ్ళలోకి ప్రేమగా చూసి నవ్వింది అమల.

—: అయిపోయింది: —